తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
13 మార్చి 2024
పేజీలు : 08



# ఆ ఇద్దరూ..




## బిఆర్ఎస్ నుంచి బరిలో నేతలు

### మల్కాజిగిరి బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

- ఇప్పటికి ప్రకటించిన కెసిఆర్, ప్రచారం ముమ్మరం
- చేవెళ్ల బీఆర్ఎస్ బరిలో కాసాని జ్ఞానేశ్వర్..!
- ఎంపీ అభ్యర్థులపై కేసీఆర్ కసరత్తు

*సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపీ అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కు షాకులమీద షాకులు తగిలాయి. ఇప్పటికే చాలా మంది నేతలు కారు దిగిపోయారు. మరికొంత మంది గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. జహీరాబాద్,పెద్దపల్లి, నాగర్ కర్నూల్ ఎంపీలు పార్టీని వీడారు. ఆ పార్టీకి ఎంపీ అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది.*




**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** తెలంగాణలో లోక్ సభ ఎన్నికల హడావిడి జోరందుకుంది. ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. ఇప్పటికే పార్టీలు ఆయా స్థానాలకు ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలవుతుందన్న వార్తల నేపథ్యంలో.. బహిరంగ సభలు నిర్వహించటమే కాకుండా, మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే పనిలో పార్టీలు పడ్డాయి. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా మల్కాజిగిరి స్థానానికి ఎంపీ అభ్యర్థిని ప్రకటించింది. ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న శంభీపూర్ రాజును మల్కాజ్ గిరి నుంచి బరిలోకి దించుతూ.. గులాబీ బాస్ కేసీఆర్ ఉత్కంఠకు తెర దించారు. గత కొంత కాలంగా మల్కాజ్ గిరి ఎంపీ సీటును ఆశించిన మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి.. పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించటంతో కేసీఆర్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. 30 లక్షల పైచిలుకు ఓటర్లతో దేశంలోనే ➤ మిగతా 2లో..

# పోటీ పరీక్షలకు.. సన్నద్ధం



- ఉద్యోగాల ప్రకటనతో కోచింగ్ కేంద్రాలకు భారీగా క్యూలు
- ఫీజులు భారీగా పెంచేసిన శిక్షణ కేంద్రాలు
- 20 నుంచి 40 శాతం వరకు ఫీజుల పెంపు
- గ్రూప్-1 కోచింగ్‌కు రూ.75 వేలు వసూలు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కోచింగ్ కేంద్రాలు
- ఫంక్షన్ హాళ్లు, ఆడిటోరియాలే తరగతి గదులు
- గ్రూప్-2, పోలీసు, డీఎస్సీలకు భారీ డిమాండ్
- నిరుద్యోగుల్లో ఉద్యోగం సాధించాలన్న తపన
- అప్పులు చేసి మరీ ఫీజు చెల్లిస్తున్న అభ్యర్థులు
- హైదరాబాద్‌లో100కు పైగా కోచింగ్ సెంటర్లు
- ఏడాదికి రూ.100 కోట్ల దాకా వ్యాపారం

**హైదరాబాద్,మార్చి12(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల వద్ద హడావిడి మొదలయ్యింది. డిఎస్సీతో పాటు, గ్రూప్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్‌లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించింది. అలాగే గ్రూప్ పరీక్షలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే కుస్తీ ➤ మిగతా 2లో..

# విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం

### సామాజికవేత్త చికిలే మధు బాబు

**కుత్బుల్లాపూర్ మార్చి 12 (జనం సాక్షి) :** విద్యతోనే భవిష్యత్తు నిర్మాణమవుతుందని సామాజికవేత్త చికిల మధుబాబు అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్ ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ బలహీనతని బలంగా మార్చుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షులు విజయకుమార్, టిఆర్ఎస్ నాయకులు రాయి విగ్నేష్ మాట్లాడుతూ చదువుతూనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు వినయ్, రవీందర్ రెడ్డి, గణిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం కృషి చేయాలి

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ వాలిదాస్ జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, మార్చి 12 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ కు కీలక నియోజకవర్గంగా భాసిల్లుతున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం తో పాటు జిహెచ్ఎంసి పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు కురువైభవాన్ని సాధించే దిశగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ముందుకు సాగాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాళిదాసు ➤ మిగతా 2లో..



### మున్నూరు కాపులకు గత ప్రభుత్వం


## కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మోసం చేశారు

- 5000 కోట్లతో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా మున్నూరు కాపులను బలపరచాలి
- మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్



**శంషాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రంగారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘంలోని కుల పెద్దల సమావేశం జిల్లా కార్యదర్శి శ్రవణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కొండ దేవయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా చాలా వెనుక బడిన ప్రాంతం ➤ మిగతా 2లో..

# పోటీ పరీక్షలకు సన్నద్ధం



పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతున్నా యి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఉపాధి కోసం వేల మంది యువత ఎదురు చూస్తోంది. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వెలువడక పోవడంతో ఉపాధి కోసం జిల్లాల్లో వేల మంది యువతి, యువకులు ఎదురుచూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించాలి. కానీ కొన్నేళ్లుగా అది జరగడం లేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది ప్రైవేట్ పాఠశాలలో చదువులు చెప్పే
అవకాశాన్ని కోల్పోయారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేయడంతో జిల్లాలో నిరుద్యోగులు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో శాఖల వారీగా ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న పోస్టులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురి స్తున్నాయి. ఇవేకాకుండా మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు.

ప్రధానంగా విద్యా, వైద్యశాఖలతో పాటు పోలీసుశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగాల నియామకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని కూడా పెంచుతూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మరింత ఆశలను రేకెత్తిస్తోంది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది. మరో 21 ప్రభుత్వ శాఖల్లో వెయ్యికి పైగా ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పడుతున్న కష్టాలు కొందరికి ఆదాయ మార్గాలయ్యాయి. ఉద్యోగార్థుల ఆశలు వ్యాపార వస్తువుగా మారాయి. ఏళ్ల తరబడి నిరుద్యోగుల నిరీక్షణ, పోరాటం తరువాత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రకటన చేయడంతో .. పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు దీనిని సొమ్ము చేసుకునే పనిలో పడ్డాయి. అవకాశం వచ్చినప్పుడే సంపాదించుకోవాలన్నట్లుగా కోచింగ్ ఫీజులను భారీగా పెంచేశాయి. బ్యాచ్‌ల సంఖ్యను పెంచి, శిక్షణ వ్యవధిని తగ్గించి మరీ.. కాసుల వేటకు తెరలేపాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేరొందిన పలు కోచింగ్ సెంటర్లు గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల శిక్షణకు వసూలు చేసే ఫీజులను 20 నుంచి 40 శాతం మేర పెంచాయి.

అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్, విద్యానగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో ఉన్న కోచింగ్ సెంటర్లన్నీ ఒక్కసారిగా ఫీజులు పెంచేశాయి. ఈ కోచింగ్ సెంటర్లలో సాధారణంగా గ్రూప్-1 కోచింగ్ ఫీజు రూ.55 వేల నుంచి రూ.60 వేల మధ్య ఉండేది. ప్రస్తుతం ఆ ఫీజు రూ.75 వేల వరకు పెరిగింది. ఇక గ్రూప్-2 కోచింగ్‌కు ఆరు నెలల వ్యవధికిగాను రూ.18 వేల వరకు ఉండే ఫీజు ఇప్పుడు రూ.25 వేలు అయింది. గ్రూప్-2 ఇంగ్లిష్ మీడియం అయితే రూ.30 వేలకుపైనే వసూలు చేస్తున్నారు.

కాగా, పోలీసు ఉద్యోగాలకు శిక్షణనిచ్చే దిల్‌సుఖ్‌నగర్‌లోని పలు కోచింగ్ సెంటర్లు రూ.10 వేల నుంచి రూ.15 వేల మేర ఫీజులను నిర్ణయించాయి. కొన్ని సంస్థలు వ్యాయామ తరగతుల పేరుతో రూ.20 వేల వరకు కూడా వసూలు చేస్తున్నాయి. ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ఇంకా నోటిఫికేషన్ రాకపోయినా.. డీఎస్సీ కోచింగ్‌కు పలు శిక్షణ కేంద్రాలు డెమో క్లాసులను ప్రారంభించాయి. ఇందుకు ఫీజును రూ.15 వేల నుంచి రూ.20 వేలుగా నిర్ణయించాయి. కొన్ని కోచింగ్ సెంటర్లు ఆన్‌లైన్ కోచింగ్ విధానాన్ని కూడా కొనసాగిస్తున్నాయి. ప్రత్యక్ష తరగతులకు హాజరయ్యేవారు చెల్లించే ఫీజు కన్నా 40 నుంచి 50 శాతం మేర తక్కువ ఫీజును ఆన్‌లైన్ కోచింగ్‌కు వసూలు చేస్తున్నారు.

### క్యూ కడుతున్న నిరుద్యోగులు..

ప్రభుత్వం ఒకేసారి 80 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించడం, వీటిలో 30 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి కూడా ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఆశలు రెట్టింపయ్యాయి. దీంతో ఏళ్ల తరబడి ప్రభుత్వ కొలువు కోసం ఎదురుచూస్తున్న వారు.. కోచింగ్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. వయో పరిమితి కూడా పెంచడంతో.. ఇప్పటికే ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడ్డ వాళ్లు కూడా ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసి ఇళ్లకు పరిమితమైన గృహిణులు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న మహిళలు మళ్లీ పుస్తకాలు తెరిచేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ అధికమవుతోంది. ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకున్న కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కసారిగా ఫీజులను పెంచేశారు. ఉద్యోగం సాధించాలన్న తపనతో నిరుద్యోగులు అప్పులు చేసి ఈ ఫీజులు చెల్లిస్తున్నారు.

నగరంలో మొత్తం 100కు పైగా కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. రూ.100 కోట్ల దాకా వ్యాపారం చేస్తున్నాయి. ఈ కేంద్రాలు గ్రూప్-2, పోలీసు, ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సబ్జెక్టుల వారీగా కోచింగ్ ఇచ్చే వ్యవధిని కూడా తగ్గించేశాయి. సాధారణంగా రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటల చొప్పున తరగతులు నిర్వహించి మొత్తం ఆరు నెలల వ్యవధిలో ఆయా పరీక్షలకు సంబంధించిన శిక్షణను పూర్తి చేసేవారు. ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య పెరగడంతో శిక్షణ కాలాన్ని మూడు నుంచి నాలుగు నెలలకు తగ్గించేశారు.

### పుట్టగొడుగుల్లా కోచింగ్ సెంటర్లు..

శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తున్న నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండ డంతో కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు అవసరం లేకపోవడంతో కొత్త కొత్త కేంద్రాలు వెలుస్తున్నాయి. గతంలో మూతపడిన పలు కోచింగ్ సెంటర్లు కూడా తిరిగి తెరుచుకుంటున్నాయి. ఈ కోచింగ్ సెంటర్లన్నీ ఏప్రిల్‌లోనే మూడు నుంచి ఐదు బ్యాచ్‌లను ప్రారంభించే ందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఒక్కో బ్యాచ్‌లో కనీసం 500 మంది అభ్యర్థులు ఉండే అవకాశాలున్నాయి.

ఇక, తరగతుల నిర్వహణకు కొన్ని కోచింగ్ సెంటర్లు ఫంక్షన్‌హాళ్లను బుక్ చేసుకున్నాయి. ఓ కోచింగ్ సెంటర్ దోమలగూడలోని ఏవీ కాలేజీ ఆడిటోరియాన్ని తమ కార్యకలాపాలకు పూర్తిగా వినియోగించు కుంటోంది. మరో భారీ ఆడిటోరియం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. రానున్నది పెళ్లిళ్ల సీజన్ కావడం, ఫంక్షన్‌హాళ్లకు డిమాండ్ ఉండటంతో చాలా కోచింగ్ సెంటర్లు ప్రముఖ కాలేజీల ఆడిటోరియాల కోసం చర్చలు జరుపుతున్నాయి.

### రీడింగ్ రూమ్‌లకూ తాకిడి

ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో రీడింగ్ రూమ్‌ల వద్ద కూడా తాకిడి పెరిగింది. పోటీ పరీక్షలకు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు చాలా మంది ప్రిపరేషన్ కోసం రీడింగ్ రూమ్‌ల బాట పడుతున్నారు. అక్కడి ప్రశాంత వాతావరణం ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో వెళ్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో 300కు పైగా రీడింగ్ రూమ్‌లు, స్టడీ సెంటర్లు ఉన్నాయి. నగరంలోని చిక్కడపల్లి, అశోక్‌నగర్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, వెంగళ్‌రావునగర్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, మలక్‌పేట్, సికింద్రాబాద్‌లోనూ 210 దాకా సెంటర్లు నడుస్తున్నాయి. ఒక్కో సెంటర్‌లో 150 నుంచి 200 మంది వరకు అవకాశం కల్పిస్తున్నారు. కొన్ని స్టడీ సెంటర్లు మహిళల కోసం ప్రత్యేక క్యాబిన్లు కూడా ఏర్పాటు చేస్తున్నాయి. 24 గంటలపాటు ఈ సెంటర్లను నిర్వహిస్తుండటంతో అభ్యర్థులు తమకు అనుకూలమైన సమయంలో వెళ్లి చదువుకుంటున్నారు. నాన్ ఏసీ స్టడీ సెంటర్లు నెలకు రూ.1000, ఏసీ, వైఫై సౌకర్యం ఉన్న చోట్ల నెలకు రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు.

### ఏకాగ్రత లభిస్తోంది

నేను అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాను. రోజూ కోచింగ్‌కు వెళ్తాను. ఆ తర్వాత మా హాస్టల్ సమీపంలోని ఓ స్టడీ స్పేస్ సెంటర్‌కు వెళ్లి చదువుకుంటాను. అక్కడ ఏకాగ్రత లభిస్తోంది. రోజులో దాదాపు 6 నుంచి 8 గంటల వరకు చదువుకుంటాను. ఏసీ గదికి నెలకు రూ.1700 చెల్లిస్తున్నాను.

**- పరమేశ్వరి, సివిల్స్, అభ్యర్థిని**

### నిరుద్యోగుల కోసం కాదు..

డబ్బు కోసమే నోటిఫికేషన్లను ఆసరాగా చేసుకొని కోచింగ్ సెంటర్లు దోపిడీకి ప్లాన్ చేసుకున్నాయి. నిర్వాహకులకు ఇదో వ్యాపారం మాత్రమే. చాలా సంస్థలు డబ్బు కోసమే పని చేస్తాయి తప్ప.. నిరుద్యోగుల కోసం కాదు. ఇప్పటివరకు మెరుగైన ర్యాంకులు, ఉద్యోగాలు సాధించినవారు సొంతంగా చదివినవారే. అభ్యర్థులు సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ అవ్వాలి. స్వీయ ప్రణాళిక చేసుకుంటేనే విజేతలవుతారు

## ఆ ఇద్దరూ..

అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గంగా ఉన్న మల్కాజ్‌గిరిపై అన్ని పార్టీలు ఫోకస్ చేశాయి. అయితే.. గతంలో ఆ స్థానంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఎంపీగా ఉండగా.. ఇప్పుడు ఎవర్ని బరిలోకి దించాలని కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. మరోవైపు.. బీజేపీ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను పోటీలో దించింది. అయితే.. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి రెండో సారి మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలవగా.. మల్కాజ్ గిరి ఎంపీ స్థానాన్ని కూడా ఎలాగైనా కైవసం చేసుకోవాలని గులాబీ బాస్ కేసీఆర్.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. బీజేపీ నుంచి బరిలోకి దిగిన ఈటల రాజేందర్‌ను, కాంగ్రెస్ నుంచి బరిలోకి దించే అభ్యర్థులిద్దరినీ.. ఓడించాలని కేసీఆర్ వ్యూహాలు రచిస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఎమ్మెల్సీగా ఉన్న యువకుడైన శంభీపూర్ రాజును బరిలోకి దించి.. గట్టి పోటీ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. అయితే.. ఉద్యమకారుడైన శంభీపూర్ రాజు 2001 నుంచి టీఆర్ఎస్‌లో కొనసాగుతుండగా.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన కార్యకర్త నుంచి ఎమ్మెల్సీ వరకు ఎన్నో పదవుల్లో పని చేశారు. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్‌కు చెందిన రాజుకు.. మేడ్చల్-మల్కాజ్ గిరి నియోజకవర్గంలో మంచి ఫాలోయింగ్ ఉండటంతో పాటు మల్లారెడ్డి కూడా సపోర్ట్ చేయటంతో.. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వొచ్చని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

మరోవైపు చేవెళ్ల లోక్ సభ స్థానం పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి ఆసక్తిగాలేరు. ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారు. ఇక్కడ నుంచి ఎవరిని పోటీకి దించాలా అన్న అంశంపై కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీకి గుడ్ బై చెప్పి గులాబీ కండువా కప్పుకున్న కాసాని జ్ఞానేశ్వర్ పేరును చేవెళ్ల ఎంపీ స్థానానికి ఖరారు చేశారని వార్తలు వస్తున్నాయి. తాజాగా చేవెళ్ల, నల్లొండ, భువనగిరి నియోజకవర్గాలపై గులాబీ బాస్ కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. చేవెళ్ల బరి నుంచి రంజిత్ రెడ్డి వ్యక్తిగత కారణాలతోనే తప్పుకున్నారని కేసీఆర్ చెప్పారని తెలుస్తోంది. ఆయన పార్టీ మారడంలేదని పార్టీ నేతలకు క్లారిటీ ఇచ్చారు. చేవెళ్ల లోకసభ స్థానంలో విజయంపై కేసీఆర్ ధీమాగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా చూసినా ఎంపీ సీటు గెలుస్తామన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతోనూ కేసీఆర్ చర్చలు జరిపారు. అయితే ఎంపీ టిక్కెట్ ఆశించిన గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొనకపోవడంపై చర్చ జరుగుతోంది. అమిత్ రెడ్డి ఇప్పటికే ఎంపీ టిక్కెట్ విషయంలో వెనక్కి తగ్గారు. టిక్కెట్లు ఆశిస్తున్న నేతల వివరాలను కేసీఆర్ పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఈ బాధ్యతను మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి అప్పగించారు.

## గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం కృషి చేయాలి

జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి లో కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ చైర్మన్ ప్రకాష్ గౌడ్ ఎంపిక చేసిన నూతన కమిటీకి జగదీశ్వర్ గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. టిపిసిసి లేబర్ సెల్ చైర్మన్ గా నల్ల సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ గా బి కృష్ణ ముదిరాజ్, జాయింట్ సెక్రటరీగా ఎం తిరుపతి, రంగారెడ్డి జిల్లా టిపిసిసి లేబర్ సెల్ అధ్యక్షులుగా వి వీరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా పి దినేష్ రాజ్ తదితరులను ప్రకాష్ గౌడ్ ఎంపిక చేయగా ఈ మేరకు జగదీశ్వర్ గౌడ్ వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి కాంగ్రెస్ పార్టీ ఎదగాలని, గ్రేటర్ పరిధిలో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్ ఆవిర్భావానికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందనిజగదీశ్వర్ గౌడ్ అన్నారు. 6 గ్యారెంటీ ల హామీ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంద్వారా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి గట్టిగా కృషి చేయాలని జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను సాగిస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామని వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు నియోజకవర్గ స్థాయిలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని ఆయన హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, ఆయా డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులకు గత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మోసం చేశారు

మున్నూరు కాపులు పేదరికంలో ఉన్నారు, గత పది సంవత్సరాల నుండి మున్నూరు కాపు కార్పొరేషన్ కొరకై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి అర్జీలు వినతి పత్రాలను అందజేశామన్నారు. మున్నూరు కాపులు తెలంగాణ వ్యాప్తంగా ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనకబడమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 24% సుమారు 60 లక్షల మంది మున్నూరు కాపులు ఉన్నారు. తెలంగాణ వచ్చిక తెలంగాణ ప్రాంతంలో అత్యధిక కులస్తుల్లో మున్నూరు కాపులు 60 లక్షల మంది ఉన్నా , కార్పొరేషన్ ను సాధించలేకపోయారు. తెలంగాణ ప్రాంతంలో మున్నూరు కాపులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండాలన్నారు, ప్రభుత్వం మున్నూరు కాపులను గుర్తించి రాజకీయ ఎదుగుదలకు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు తప్ప తమకు ఆదాయ మార్గాలు చూపించాలని గత కొన్ని దశాబ్దాలుగా కార్పొరేషన్ కోసం ఎదురుచూస్తున్న తమ ఆశను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కోకాపేట్ లో కమ్యూనిటీ హాల్ కు 20 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని, 5000 కోట్లతో తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గాదె రాజశేఖర్ పటేల్, ఎడ్ల రవికుమార్ పటేల్, రాష్ట్ర యువత అధ్యక్షులు బండి సంజయ్ పటేల్ ,గ్రేటర్ యూత్ ప్రెసిడెంట్ శివ పటేల్, శంషాద్ మండల అధ్యక్షులు చేవెళ్ల ప్రసాద్ పటేల్, అశోక్ పటేల్ , పటేల్ జయశంకర్, భూపాలపల్లి జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# బ్లూ ఇండియా పార్టీ వెబ్‌సైట్ ప్రారంభం

**చట్ట సభల్లో బీసిల రిజ్వేషన్ సాధించాలి**
**కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ బిసిలకు చేసిందేమీ లేదు : రాష్ట్ర అధ్యక్షుడు బెంగు ప్రసాద్ గౌడ్**



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బెంగు ప్రసాద్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్లూ ఇండియా వెబ్సైట్ ను ప్రారంభించి, ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీ ల వాట ప్రకారం చట్ట సభల్లో రిజ్వేషన్ కల్పించాలని అప్పుడే బిసిలు ఆర్థికంగా ,రాజకీయంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ బిజెపి పార్టీలను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని,స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ దేశాన్ని పాలిస్తూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల అభివృద్ధి సంక్షేమం ను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు అని ఆయన అన్నారు. బీసీ కమిషన్ ఇచ్చిన నివేదికలను పక్కన పెట్టి బీసీ కుల గణన జరపకుండా అన్ని పార్టీలు అడ్డుతగులుతున్నయని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ హయాంలో కేవలం 1800 కోట్లు బీసీలకు కేటాయించి చేతులు దులుపు కున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అనేక అంశాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన వాటా ను అడ్డుకున్నారని అన్నారు. త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని కనుచూపు మేరలో కనిపించకుండా చేశారన్నారు. అందుకోసమే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలను కలుపుకొని జనాభా దామాషా ప్రకారం పార్ల మెంటు ఎన్నికల్లో బ్లూ ఇండియా పార్టీ ద్వారా సామాజిక న్యాయంతో కూడినటువంటి అభ్యర్థులు ప్రకటన ఉంటుందని తెలియజేశారు. డిజిటల్ మీడియా ప్రపంచాన్ని శాసిస్తున్నటువంటి సంద ర్భంలో సోషల్ మీడియా ద్వారా పార్టీకి బలం చేకూరుచడానికి ఈ రోజు వెబ్సైట్ ను కూడా ప్రారంభించుకున్నం అన్నారు. ఇంక పలువురు పార్టీ నాయకులు పార్టీకి సలహా సూచనలను చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ భూపాల్ , పార్టీ కోశాధికారి బెంపల్లి మధు, పార్టీ ఉపాధ్యక్షులు షేక్ అమీనుద్దీన్, సుంకరి లింగారెడ్డి , పార్టీ కార్యదర్శులు రాకేష్ నాయక్, శ్రీలత ,పిట్టల విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



## చేతి గుర్తే మహిళలకు చేయూతగా మారింది

**సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి**

**సిటీబ్యూరో (జనంసాక్షి) :** చేతి గుర్తే మహిళలకు చేయూతగా నిలిచి ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని, వంద రోజుల్లోపే ఆరు గ్యారంటీలను అమలుచేసి మాట నిలబెట్టుకుందని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సు కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇప్పుడు డ్వాక్రా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించి ప్రతి ఇంటికి మహిళను మహారాణిగా నిలుపుతున్నారని తెలియజేసారు. ప్రతినెల 2500 రూపాయలు అందించబోతూ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దన్నగా నిలవనుందన్నారు. ఆడబిడ్డలకు పెళ్లి కానుకగా రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం అందించడం పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తమన్నారు. అన్నిరంగాల్లో మహిళల్ని ముందుకు తీసుకుపోతూ అగ్రగామిగా నిలుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## సిటిజన్ షిప్ ఇచ్చేందుకే సీఏఏ అమలు

**చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** దేశంలో అమలులోకి వచ్చిన సీఏఏపై (సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్) దుష్ప్రచారం జరుగుతున్నదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఏఏ చట్టం అమలు కావడంపై సంతోషంగా ఉందన్నారు. దీనిపై రాహుల్ గాంధీ, ఖర్గే అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఏఏ అనేది సిటిజన్ షిప్ తీసేసేది కాదు.. ఇచ్చేదని పేర్కొన్నారు. పక్క దేశాల్లో మైనార్టీలను హింసిస్తే భారత దేశం స్వాగతం చెబుతున్నదన్నారు. భారత్ నుంచి ఎవరూ ఇతర దేశాలకు పారిపోవడం లేదు. ఇతర దేశాల్లో హింసకు గురైన వారే ఇక్కడకు వస్తున్నారన్నారు. ఇది వారికి సువర్ణావకాశం అని చెప్పారు. కానీ దీనిపై రాజకీయ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. భారత్‌లో అమలు చేస్తున్న సీఏఏను పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో అమలు చేయగలరా అని ప్రశ్నించారు. ఇక్కడి నుంచి ముస్లింలు పాకిస్తాన్‌కు వలస వెళ్లడం లేదని పేర్కొన్నారు. పీఎం మోడీ పాలనలో భారత్‌లో హిందూ ముస్లింలు కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. రంజాన్ నెలలోని మొదటి రోజు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియానికి అమిత్‌షా వచ్చారన్నారు. ఈ సందర్భంగా మైనార్టీలను ఆదుకునేవాళ్లమని, త్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామని చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మైనార్టీలకు ఏమీ చేయలేదన్నారు. చేతి వృత్తుల వారిని ఆదుకునేందుకు పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ట్రైనింగ్, స్టై ఫండ్, రూ.పది లక్షల వరకు లోన్ కూడా ఇస్తున్నామన్నారు.


## హెచ్‌హెచ్‌ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణ పేదలకు ఉచిత ఆరోగ్య సేవలు



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని మురికివాడల్లో ఉన్న పట్టణ పేదలకు ఉచితంగా ఆరోగ్య సంరక్షణ అందించారు. వందకు పైగా అర్బన్ మురికివాడలు, పదిహేడు గ్రామాల్లోని సుమారు ఎనిమిది లక్షల మంది పట్టణ పేదలకు ఈ సేవలు అందాయి. హైదరాబాద్ నగర జనాభాలో ముస్లిం మైనారిటీలు 43 శాతం ఉన్నారు. వీరిలో 60 శాతం మంది బలహీన వర్గాలకు చెందినవారు. ఎనిమిది లక్షల పేద రోగులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా హెచ్ హెచ్ ఎఫ్ ఇందులో 30 శాతాన్ని కవర్ చేసింది. ఈ లబ్ధిదారులు పేదరికం, అసమానతలను అంతం చేయడానికి యూఎన్ ద్వారా స్ట్రాటజిక్ డెవలప్‌మెంట్ గోల్స్ వ్యూహాత్మక అభివృద్ధి లక్ష్యాలకు (ఎస్డీజీ) ఇది గణనీయంగా దోహదపడింది.

## చిన్న సినిమాల సరసన 'హర హర' నిలిచిపోవాలి

**కంటెంట్ నచ్చితే చాలు సినిమా లోపల ఉన్న కటౌట్లు అక్కర్లేదు : జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'హర హర' సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హర హర ఓం, కేకే మీడియా క్రియేషన్స్ బ్యానర్ పై నందు యార్లగడ్డ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హర హర చిత్రం పోస్టర్ లాంచ్ చేశారు. ఈ చిత్రం పోస్టర్ లాంచ్ ఆవిష్కరణ చేసిన జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చిత్ర యూనిట్ సమక్షంలో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి మాట్లాడుతూ తెలుగు వాళ్లకు సినిమాలు అంటే ఎంతో ప్రాణం. చిన్న సినిమానా పెద్ద సినిమానా అని ఆలోచించరు. కంటెంట్ నచ్చితే చాలు సినిమాలోపల ఉన్న కటౌట్లు ఎవరూ అని కూడా పట్టించుకోరు. నచ్చినన్ని సార్లు సినిమాను చూసేస్తారు. ఇటీవలి కాలంలో ఎన్నో చిన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ కోవలోకి వచ్చిన మరొక సినిమా 'హర హర'. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే నిజంగా ముచ్చటేస్తోంది. ఇంత తక్కువ బడ్జెట్ తో అంత మంచి అవుట్ ఫుట్ తీసుకుని రావడం చూస్తుంటే ముచ్చటేస్తోంది. దర్శకుడు నందు యార్లగడ్డ ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతారని ఆశిస్తూ ఉన్నాను. నిర్మాతలకు బాగా డబ్బులు రావాలని, ఇంకొన్ని మంచి సినిమాలు చేయాలని ఆశిస్తూ ఉన్నాను. డైరెక్టర్ నందు మాట్లాడుతూ ఇక శివుడికి సంబంధించిన సినిమా కాబట్టి.. ఆ పరమ శివుడి ఆశీస్సులు కూడా మా పై ఉంటాయి అని తెలిపారు. ఈ సినిమా సినిమా తప్పకుండా ఘన విజయం సాధిస్తుంది భావిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ కిరణ్ డైరెక్టర్ నందు యార్లగడ్డ, బలగం ఫేమ్ రూపలక్ష్మి, సంగీత దర్శకుడు ఎమ్మెల్ రాజా హీరో కిరణ్ హీరోయిన్ రామ అజ్ఞశ్రీ కెమెరామెన్ ఉదయ్ భాస్కర్, ఇతర నటీనటులు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



## నాలుగేళ్లయినా నడకకు దారేదీ..?

**పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవా? : రచ్చ కిషన్**



**మేడిపల్లి (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నాలుగేళ్లవుతున్నా 30 ఫీట్ల రోడ్డుకు మోక్షం కలగడం లేదని, పదవులు తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేని కార్పొరేటర్ దాపురించారని సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ ఇంటి పక్కనే ఉన్నా తనకేమీ పట్టనట్టు కార్పొరేటర్ ఉండటం విడ్డూరమన్నారు. నలుగురు కమిషనర్లు మారినా వినతుల పరిస్థితి మారలేదన్నారు. మూడేళ్ల కింద యూజీడీ కోసం రోడ్డు మధ్యలో తవ్వకాలు జరిపి ఇప్పటిదాకా మరమ్మతులు చేయకపోవడం దారుణమన్నారు. మేయర్, కార్పొరేటర్ ఈ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందారని దుయ్యబట్టారు.



## బిజెఎంసిలో కమిషనర్ పర్యటన



**రాజేంద్రనగర్, మార్చి 11 (జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో శానిటేషన్, ఇంటి పన్ను చెల్లించాలని కార్పొరేషన్ లోని వివిధ వార్డుల్లో పర్యటించిన కమిషనర్ బి. శరత్ చంద్ర. మంగళవారం ఉదయం శివసాయి నగర్ ఫేజ్ 2 అసోసియేషన్ వారిని కలిసి పలు సమస్యలను తెలుసుకుని, వాటిని ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. అలాగే కాలనీ వాసులంతా ఇంటి పన్ను చెల్లించాలని వారికి ఆదేశించారు. 100% డోర్ టు డోర్ చెత్త సేకరించాలి. 13,14,15 లలో చెత్త సేకరణను పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వినయ్ జనరల్ సెక్రెటరీ శ్రవణ్ కుమార్, శానిటరి ఇన్స్పెక్టర్, బిల్ కలెక్టర్ చంద్ర శేఖర్ ,కాలనీ వాసులు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం



**ఎల్బీనగర్ మార్చి 12 (జనం సాక్షి) :** హస్తినాపురం డివిజన్ అనుపమ నగర్ కాలనీలో నీ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి సహిత గణపతి ,సూర్య ,అంబిక భవాని ,శంకర స్వామి వార్ల ఆలయంలో చతుర్ధ బ్రహ్మోత్సవాలలో భాగంగ శివ పార్వతి కళ్యాణం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉ 8గం లకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, అమ్మవారికి అభిషేకము, చండీహెూమము మండప పూజలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. శ్రీ దేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణము, శాంతి మండప పూజలు, నీరాజన, మంత్ర పుష్పాదులు, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ తో పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పాలకమండలి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

### మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి




**కీసర, మర్చి 12 (జనంసాక్షి) :** నాగారం మున్సిపాలిటీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూటికి నూరు శాతం ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో బిల్ కలెక్టర్లు తమకు కేటాయించిన వార్డుల్లో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని బిల్ కలెక్టర్లకు, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్‌లకు ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలంతా సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్రకుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే బ్రిడ్జి వంతెన నిర్మాణం పనులు ప్రారంభం

### హర్షం వ్యక్తం చేసిన నాయకులు నయీమ్ ఖాన్



**తాండూరు మార్చి 12(జనంసాక్షి)** గత కొన్ని సంవత్సరాలుగా పాత తాండూరు ప్రజలు రైల్వే గేట్ తో సతమతమవుతున్న కళ రైల్వే బ్రిడ్జి వంతెన పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభం అయ్యాయి. రైల్వే బ్రిడ్జ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 78 కోట్లు మంజూరు అయిన విషయం తెలిసిందే, రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నయీమ్ ఖాన్ మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా పాత తాండూర్ వాసులు రైల్వే గేట్ తో ఎదుర్కొంటున్న సమస్యను రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల కష్టాలు దూరం అవుతాయని అన్నారు. రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం కై కృషిచేసిన స్థానిక శాసనసభ్యులు మనోహర్ రెడ్డికి అదేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే బ్రిడ్జి వంతెన నిర్మాణంలో ఇల్లు కోల్పోతున్నవారు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం 10 కోట్ల 90 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించిందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం ప్రాంతంలో ఇండ్లు కోల్పోతున్న ప్రతి ఒకరికి ప్రభుత్వం నష్టపర పరిహారాన్ని చెల్లిస్తుందని తెలిపారు. రైల్వే బ్రిడ్జి వంతెన నిర్మాణం ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి స్థానిక శాసనసభ్యుల మనోహర్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన నాయకులు



**తలకొండపల్లి మార్చి12(జనంసాక్షి):** తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన వడ్డే మార్ల ప్రభు వయసు 30,గుండెపోటుతో సోమవారం రాత్రి అకస్మాత్తుగా మరణించారు.విషయం తెలుసుకున్న పలువురు ప్రజా ప్రతినిధులు మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు.మృతుని దాహన సంస్కారాల నిమిత్తం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్,తన అనుచరుడు మాడుగుల రామస్వామి ద్వారా రూ,3 వేలు,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏమిరెడ్డి భగవాన్ రెడ్డి రూ,3 వేలు,మాజీ సర్పంచ్ చంద్రయ్య రూ,2 వేలు,బిజెపి పార్టీ నాయకులు వడ్ల సత్యం జైశ్రీరామ్ సేవాసమితి ద్వారా రూ,2,వేలు,మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి రూ,2 వేలు,కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే కుటుంబ బరువు బాధ్యతలు మోస్తూ జీవనం సాగిస్తున్న ప్రభు మరణం చాలా బాధాకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో రవి కిరణ్ రెడ్డి,మాజీ వార్డు మెంబర్ తూర్పుశ్రీను,దుడ్డు స్వామి,జలగం శ్రీశైలం,దుడ్డు మల్లయ్య,కాలే మహేష్,జాజాల నరేష్,మెర్గే శ్రీను,కూరాకుల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత కేసు నమోదు

**తలకొండపల్లి మార్చి12(జనంసాక్షి):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలవుతున్న సందర్భంగా తలకొండపల్లి మండల పరిధిలోని వీరన్న పల్లి గ్రామంలో కిరాణా షాపులో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని అమ్ముతున్నారని సమాచారం మేరకు మంగళవారం పోలీసులు వీరబొమ్మ అంజయ్య,కిరాణా షాపును తనిఖీ చేయగా బీర్లు బాటిల్స్,కోటర్ సీసాలు దొరికినాయి.మద్యాన్ని స్వాధీనం చేసుకొని కిరాణా షాపు యజమానిని అదుపులోకి తీసుకొని విచారించి పోలీస్ స్టేషన్,కు తరలించి కేసు నమోదు చేశామని తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.మండలంలోని గ్రామాలలో ఎవరు కూడా బెల్ట్ షాపులు నిర్వహించరాదని నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చిట్టిగిద్ద వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవానికి కళ్యాణ వస్త్రాలు

### సమర్పించిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్



**వికారాబాద్ రూరల్, మార్చి 12 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లాలోని నవాబుపేట మండలంలోని చిట్టి గిద్ద గ్రామంలో బుధవారం రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని జరగబోయే మహా కళ్యాణ మహెూత్సవంకు పూస్తెమట్టెలు కళ్యాణ వస్త్రాలు సమర్పించిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీ పామేన జ్యోతి భీమ్ భరత్ ప్రపంచ ప్రఖ్యాత స్వామివారి కల్యాణంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతం అని జ్యోతి భీమ్ భరత్ తెలిపారు. ఇంతటి ప్రతిష్ట కలిగిన ఈ ఆలయ అభివృద్ధికి తాము శాయశక్తుల అంకితభావంతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తన మీద ప్రేమ చూపించిన ఆలయ నిర్వహకులకు గ్రామ ప్రజలకు ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం



**శామీర్‌పేట, మార్చి 12 (జనంసాక్షి) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం జరిగింది. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేట గౌడ సంఘం సభ్యుల సహకారంతో అలాగే ఆలయ కమిటీ తరపున అన్న దానం చేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలం కు చెందిన భక్తులు, రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి : కౌలే జగన్నాథం




**ఎల్బీనగర్ ,మార్చి12 (జనం సాక్షి) :** మహిళలకు సామాజిక, ఆర్థిక సాధికారతతో పాటు రాజకీయ సాధికారతను సాధించాలని భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం అన్నారు.హైదరాబాద్ లోని సాగర్ కాంప్లెక్స్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు, ప్రముఖ సమాజ సేవకురాలు సావిత్రి పట్నాలను శాలువతో ఘనంగా సన్మానించి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా కౌలే జగన్నాథం మాట్లాడుతూ. మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మగవాళ్ళకి దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని కోరుకుంటూ, మానవ జాతికి మహిళ ఒక వరం అని, అలాగే మహిళా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు శుభాకాంక్షలు



**కాప్రా, మార్చి 12 (జనంసాక్షి) :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ బాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్ నాగరాజు ను కాప్రా సాకెట్ కాలనీ కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాకేత్ కాలనీ కార్యదర్శి సురేష్ చందర్, కాలనీ సభ్యులు రహమాన్, రాజీవ్ మీనన్, రాఘవన్, రమేశ్, సెక్టర్ ఎస్ ఐ ఇద్రిస్ అలి తదితరులు పాల్గొన్నారు.

# గురు నానక్ విద్య సంస్థలో కృత్రిమ మేధస్సు "ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్" స్మార్ట్ గ్రిడ్ ఆవిష్కరణ సదస్సు



**ఇబ్రహీంపట్నం, మార్చ్12(జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్యాసంస్థలో భారత ప్రభుత్వం ద్వారా స్పాన్సర్ చేయబడిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఢిల్లీ వారి సౌజన్యంతో ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాలకు సంబందించిన స్మార్ట్ గ్రిడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(కృత్రిమ మేధస్సు) పైన జాతీయ స్థాయి సెమినార్‌ను ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్ దీప్ కోహ్లీ సదస్సులో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ స్మార్ట్ గ్రిడ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను తెలియచేస్తూ మైక్రో గ్రిడ్ మరియు నానో గ్రిడ్ గురించి వివరించారు. సోలార్ విద్యుత్ ద్వారా అధిగమించామని చెపుతూ ఇదంతా కూడా కృత్రిమ మేధస్సు, ఇలాంటి సదస్సుల ద్వారా ఈ రంగంలో నిష్ణాతులై విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులకు అయన ధన్యవాదాలు తెలుపుతూ కార్యక్రమానికి తమ అనుభవాన్ని, పరిశోధనలను ప్రస్తతము చేస్తున్న నూతన ఆవిష్కరణల గురుంచి తెలియచేయడానికి నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ యేముల, డాక్టర్ ఏ. రఘు రామ్, జె యెన్ టి యూ హెచ్, డాక్టర్ ఈ. విద్యా సాగర్, ఉస్మానియా యూనివర్సిటీ ల నుండి అతిథులుగా విచ్చేసిన వక్తలకు అయన ధన్యవాదాలు తెలియచేస్తూ వారి పరిపూర్ణ అనుభవాన్ని నేటి తరం ఇంజినీర్లతో పంచుకుంటున్నందుకు వారికి మార్గ నిర్దేశనం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియచేసారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎ ఎస్ సైని తన సందేశంలో వక్తలకు ధన్యవాదాలు తెలుపుతూ, ఏ1 గ్రిడ్‌లో కమ్యూనికేషన్స్, స్మార్ట్ గ్రిడ్‌లో ఉపయోగించే వైర్‌లెస్ కమ్యూనికేషన్ సిస్టమ్‌లు, స్విచింగ్ టెక్నిక్స్, స్మార్ట్ మీటరింగ్ మరియు దాని ప్రోటోకాల్స్, అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మల్టీ ఏజెంట్ సిస్టమ్ ల యొక్క పనితనాన్ని అయన విశదీకరించారు. ఈ కృత్రిమ మేధా సదస్సుకు దాదాపుగా 450 మంది విద్యార్థులు హాజరై తమ నూతన ఆవిష్కరణల పై దృష్టిపెట్టే విదంగా సదస్సు తమకు ఉపయోగపడుతుందని తెలియచేసారు.




## ఐసిఎల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయం

**తాండూరు మార్చి 12(జనంసాక్షి) :** ఐసిఎల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని సంఘం కలాన్ మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఇండియా సిమెంట్ లిమిటెడ్ (ఐసిఎల్ )వారు మంగళవారం పుష్పగిరి విట్రియో రెటీనా ఇనిస్ట్యూట్ వారి ఆధ్వర్యంలో చూపు మందగించిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగానే అవసరమైన వారికి కంటి అద్దాలు డ్రాప్స్ అవసరం మేరకు ఆపరేషన్ చేయుటకు ముందుకు వచ్చారు. కంటి పరీక్షల కేంద్రానికి గ్రామానికి చెందిన పెద్దలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఐ.సి.ఎల్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని, అదేవిధంగా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం కలాన్ మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో కంటి పరీక్షల కేంద్రం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కలాన్ గ్రామానికి చెందిన నాయకులు, వైద్యులు తదితరులు ఉన్నారు.

# ప్రజా పోరాటాల ద్వారానే లక్ష్యాలను స్వాధిస్తాం

### సిపిఐ మండల కార్యదర్శి యాదగిరి



**శంషాబాద్ (జనంసాక్షి )** శంషాబాద్ పరిధిలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి యాదగిరి విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు మార్చి 16 ,17 తేదీలలో శంషాబాద్ లోని ఎలైట్ హెూటల్ ఫంక్షన్ హాల్ లో రెండు రోజులపాటు శిక్షణా తరగతులు జరుగుతాయి అన్నారు. శిక్షణా తరగతులను సిపిఐ విజయవంతం చేయాలని శంషాబాద్ మండల సిపిఐ కార్యదర్శి జిల్లా సమితి సభ్యుడు ఆర్ యాదగిరి పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులో ప్రజా సమస్యలను పోరాటాల ద్వారానే లక్ష్యాలను నెరవేరుస్తాం. సిపిఐ శిక్షణ తరగతులు జిల్లా ఉద్యమానికి, కార్యకర్తల ఎదుగుదలకు భవిష్యత్తు ప్రజా పోరాటాలకు దోహదపడతాయని నర్రగిరి తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఆర్ యాదగిరి ఏఐటీయూసీ శంషాబాద్ మండల అధ్యక్షుడు ప్రభు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగ్స్, డ్రాయింగ్ కిట్స్



**దోమ మార్చ్ 12(జనం సాక్షి) :** దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వార పాఠశాలలో ఉన్న 150 మంది విద్యార్థులకు బ్యాగ్స్ మరియు డ్రాయింగ్ కిట్స్ పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దోమ మండల వైస్ ఎం పి పి మల్లేశం మాట్లాడుతూ మారుమూల పాఠశాలకు ఇన్ఫోసిస్ బాగ్స్ ఇవ్వడం సంతోషకారం అన్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సుధామూర్తి గారికి,సంస్థఉద్యోగులు ముత్యపు వంశీ లతోపాటు ఇందుకు కృషిచేసిన గ్రామ యువకులు కరణం శ్రీకాంత్ రావ్, కరణం క్రిష్ణకాంత్ లకు గ్రామస్థులు ,పాఠశాల యాజమాన్య కమిటి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జైరాం, వైస్ ఎంపీపీ గుర్మిట్కల మల్లేశం, కరణం శ్రీకాంత్, సంపల్లి మల్లేషం, సంకటి శశిధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చాకలి నందయ్య, పొరళ్ల ఆనంతయ్య, గొల్ల గోపాల కృష్ణ, జీడీ లింగయ్య, యాదయ్య, శేఖర్ పాల్గొన్నారు



# విద్యార్థులే ఉపాధ్యాయులై

**దౌల్తాబాద్ మర్చి,12(జనం సాక్షి):** మాటూరు,గోకాఫసల్వాద్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోజు విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులే ఉపాధ్యాయులై బోధించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మధ్యాహ్నం విద్యార్థులు నృత్యాలు, పాటలు, కథలు చెబుతూ, నాటికలు వేసి సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గా ఖలేదా బేగం, డీఈఓ గా మధు, ఎంఈఓగా ఫరియా బేగం, ప్రధానోపాధ్యాయులుగా తరుణ్, పియిటిగా సాత్విక్, 15 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, భీమ్ రెడ్డి, సాయిలు గౌడ్, వీరన్న , శానమ్మ,రేణుక, రజియా , ఏల్లేష్ పాల్గొన్నారు.



# మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్‌లో చేర్చడం పట్ల హర్షం



**మల్కాజిగిరి,మార్చి12(జనంసాక్షి) :** మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్ లో చేర్చడం పట్ల మల్కాజిగిరి మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గుండా నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుండా నిరంజన్ మాట్లాడుతూ. ఎన్నో ఏళ్ల కల మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్ లో చేర్చడమని,గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ కళ నెరవేర్చ లేకపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్ లో చేరుస్తున్నారని ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘ ప్రజలకు ఎంతో హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని కుల సంఘాలకు తప్పకుండా సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని తెలిపారు. మున్నూరు కాపు సంఘ ప్రజలు ఏకతాటిపై నిలబడి సంగం అభివృద్ధికి కృషి చేయాలని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే దిశగా అడుగులు వేయాలని కోరారు. మున్నూరు సంఘాన్ని కార్పొరేషన్ లో చేర్చడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అనుపమ నగర్ లో ఘనంగా ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వర స్వామి చతుర్ధ బ్రహ్మోత్సవాలు



**ఎల్బీనగర్, మార్చి 12 (జనం సాక్షి) :** హస్తినాపురం డివిజన్ అనుపమ నగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చతుర్ధ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనాయి. శ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానము శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ కే. వెంకట్ రెడ్డి తెలిపారు..స్వస్తిశ్రీ చాంద్రమానేన శోభకృత్ నామ సం౹౹ ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుండి ఫాల్గుణ శుద్ధ తదియ వరకు అనగా 11 సోమవారం నుండి 13 బుధవారం వరకు త్రయాహ్నిక దీక్షా పూర్వకముగా నిర్వహించబడతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉ8 గం .లకు గణపతి పూజ, పుణ్యాహవాచనము, -పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, వాస్తు, యోగినీ, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్రమండల దేవతా ఆవాహన నాందీ, దేవతాహ్వానము, ధ్వజారోహణ, గణపతి మూర్తికి అభిషేకము, సూర్యనారాయణ స్వామి వారికి అభిషేకము, అరుణ పారాయణ మహాసౌర, సూర్యనమస్కారములు లక్ష్మీగణపతి హెూమము సా 4 గంటలకు మండప పూజలు, రుద్రహెూమము శివ పార్వతి కళ్యాణము నీరాజన, మంత్ర పుష్పాదులు, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ స్వస్తి వేద పండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించే వేడుకలను భక్తులు కన్నుల పండుగగా వీక్షించి భక్తపారవ్శంతో భగవంతుని వేడుకుంటారు

# నేషనల్ ఉమెన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య

మర్పల్లి మార్చి 12 (జనంసాక్షి) ఇటీవల నేషనల్ ఉమెన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య ఎన్నిక ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య పిఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు 1992లో వరకట్న దురాచారం కొరకై వరకట్నం తీసుకోకూడదు అనే ఉద్యమంలో దుర్గా పాల్గొన్నారు. అదేవిధంగా 1995లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకై 14 సంవత్సరాల లోపల ఉన్న పిల్లలందరూ పనిలో ఉండకూడదు, పాలేరుగా చేయకూడదు పాఠశాలలో ఉండాలి అని ఈనాటి పిల్లలే రేపటి పౌరులు అని పాదయాత్రలు చేస్తూ చైతన్య గీతాలు పాడుతూ ఆయా గ్రామీణ ప్రాంతాలలో ఉమ్మడిగా ఉన్న రంగారెడ్డి జిల్లాలో అనేక రకాల బాల కార్మిక వ్యవస్థ ఉద్యమాన్ని ఉధృతం చేసినప్పుడు, బాల్య వివాహాలు చేయకూడదు, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యే నేరం అంటూ బాల్య వివాహాలకు సహకరించిన వారిని చట్టరీతంగా వారిని శిక్షించాలి, అని ఎన్నో ఉద్యమాలు చేసి అదే విధంగా అనేక సంస్థలలో తన కీలకమైనటువంటి పాత్రలు పోషించారు. సిఆర్పిఎఫ్ ఆట క్రై అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అదేవిధంగా ఉమెన్ రైట్ లెటర్స్ మిషన్ సెక్రటరీ అదేవిధంగా పాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకై వెన్ను పాటలు రచించిన రచన గానం అదేవిధంగా ఎన్నో కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు ఆర్ఫన్ చిల్డ్రన్స్ కోసమై వారు కూడా ఈ సమాజంలో వారికి గౌరవం అంటూ ఉండాలి అని అనాథ పిల్లల కోసమై ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చారు. వారిని గుర్తించాలి వారిని కూడా ఈ సమాజంలో గౌరవంగా బ్రతికే విధంగా వారిని చేయాలని, నాణ్యమైన విద్యను అందించాలి నాణ్యమైనటువంటి వైద్యం అందించాలి అంటూ ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చారు 30 సంవత్సరాలుగా పేద పిల్లల కోసమే పడుగు బలహీన వర్గాల కోసమై పిల్లలు పనిచేయకూడదు పిల్లలందరూ బడిలో ఉండాలి చదువుకోవాలి. బాల్యం పిల్లల హక్కు పిల్లలు ఉండే చోటు పాఠశాలలే అంటూ అనేక రకాల ఉద్యమాలలో చురుగ్గా పాలుపంచుకున్న డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య అదేవిధంగా ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా కోఆర్డినేటర్ గా ఎస్ఎంసి రాష్ట్ర కోఆర్డినేటర్ గా మాదిగ ఉపకులాలకు రాష్ట్ర కోఆర్డినేటర్ గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రెస్ అకాడమీ మెంబర్గా పనిచేయడం జరిగింది. డబ్బు ఆశించకుండా సామాజిక కార్యకర్తగా అధికారులు అనధికారులతో రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందుకొంటూ అంచలంచెలుగా ఎదుగుతున్నటువంటి డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య సమాజంలో ప్రతి ఒక్క పిల్లవాడు చదువుకోవాలి. వారి చదువులని అభివృద్ధి పరచుకోవాలి ఉన్నత స్థాయి వరకు ఎదగాలి అంటూ ఆయా ప్రాంతాలలో తెలంగాణ ప్రాంతంలో హైదరాబాదు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉమ్మడి కర్నూలు జిల్లా విజయనగరం జిల్లా పలు ప్రాంతాలలో బాల కార్మిక



వ్యవస్థ నిర్మూలన కొరకై తాను పనిచేయడం జరిగింది అదేవిధంగా పిఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా తల్లి తండ్రి లేని పిల్లలకు కొంత ఆర్థిక సాయం అందిస్తూ చదువుకునే విధంగా వారిని ప్రోత్సహిస్తూ వారికి పుస్తకాలు నోట్స్ మరియు చదువుకు సంబంధించినటువంటి స్టడీ మెటీరియల్ పిల్లలు ధరించేటటువంటి దుస్తులు షూస్ అందించడం జరిగింది మరియు గంగిరెద్దుల వారి జీవిత చరిత్రను సేకరించుకొని వారి పైన స్టోరీలు రాయటం వారికున్న అనాచారం గురించి వివరించడం జరిగింది డాక్టర్ పిల్లోడి గ్రామం వీర్లపల్లి మండలం మర్పల్లి జిల్లా వికారాబాద్ జిల్లా తెలంగాణ రైతు కుటుంబంలో జన్మించి అనేక రకాల ఉద్యమాలలో పాల్గొంచుకున్న డాక్టర్ పిల్లోడు లక్ష్మయ్య వీర్లపల్లి గ్రామంలో రైల్వే స్టేషన్ నిర్మాణం జరగాలని, అక్కడ లోకల్ ట్రైన్ ఆపాలి, అని అనేక మంది అధికారులకు ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, వీరందరికీ వినతి పత్రం అందించడం జరిగింది. చిన్నతనములోనే అనేక రకాల కష్టాలు పడుతూ పట్టు పట్టిన పట్టును విడవకుండా పట్టుదలతో పని చేస్తే కచ్చితంగా ఫలితం ఉంటుంది అని లక్ష్మయ్య అంటున్నారు. నేషనల్ ఉమెన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉంది అని అంటున్నారు. పలువురు నాకు అభినందనలు తెలపడంతో ఎంతో సంతోషంగా ఉంది అన్నారు.. పలువురు ఆయనను అభినందించారు.



## జగదీష్ కుటుంబ సభ్యులకు 25 వేల ఆర్థిక సాయం

మర్పల్లి మార్చి 12 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామ సబ్ స్టేషన్లో ఆపరేటర్ గా పని చేస్తున్న జగదీష్ (50) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన హెచ్ 82, మర్పల్లి ఆల్ సెక్షన్స్ యూనియన్ సభ్యులు. వారి ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు 25 వేల నగదును ఆర్థిక సాయం చేశారు. అందరితో కలిసిమెలిసిగా ఉండే జగదీష్ ను కోల్పోవడం చాలా బాధాకరమని యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాన్, మధుకర్, పెంటయ్య, మహేందర్, పోచయ్య, సుభాన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే..

కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



ఎల్బీనగర్, మార్చి 12(జనం సాక్షి) : కేంద్ర హోం శాఖ మంత్రివర్యులు అమిత్ షా నేడు ఎల్బీ . స్టేడియంలో విజయ సంకల్ప సమ్మేళన బహిరంగ సమావేశం సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో హయత్ డివిజన్ లోని వివిధ పోలింగ్ బూత్ లో పార్టీ జండాను ఆవిష్కరించి కార్యకర్తలతో కలసి సమావేశానికి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ బండారి భాస్కర్ , జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోరండ మహేష్ , డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్ , సీనియర్ నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ , జనార్దన్ , శ్రీనివాస్ రెడ్డి , శ్రీను, , అరుణ్ , బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు ఎర్ర ప్రేమ్, శ్రీకాంత్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలి



జవహర్‌నగర్, మార్చి 12 (జనంసాక్షి) : మహిళలు స్వశక్తి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. మహిళా స్వయం సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి పరేడ్ మైదాన్ లో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి కార్యక్రమానికి మంగళవారం కార్పొరేషన్ లోని మహిళా సంఘం సభ్యులు బయలుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి హాజరై బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ప్రకటనతో కోచింగ్ సెంటర్లకు డిమాండ్

### అప్పుడే ఉద్యోగాల కోసం యువత కుస్తీ ఖాళీల ఆధారంగా యువత ప్రయత్నాలు

హైదరాబాద్,మార్చి12 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల వద్ద హడావిడి మొదలయ్యింది. డిఎస్సీతో పాటు, గ్రూప్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించింది. అలాగే గ్రూప్ పరీక్షలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతున్నాయి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఉపాధి కోసం వేల మంది యువత ఎదురు చూస్తోంది. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వెలువడక పోవడంతో ఉపాధి కోసం జిల్లాల్లో వేల మంది యువతి, యువకులు ఎదురుచూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించాలి. కానీ కొన్నేళ్లుగా అది జరగడం లేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది ప్రైవేట్ పాఠశాలలో చదువులు చెప్పే అవకాశాన్ని కోల్పోయారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేయడంతో జిల్లాలో నిరుద్యోగులు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో శాఖల వారీగా ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న పోస్టులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురి స్తున్నాయి. ఇవేకాకుండా మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యా, వైద్యశాఖలతో పాటు పోలీసుశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగాల నియామకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని కూడా పెంచుతూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మరింత ఆశలను రేకెత్తిస్తోంది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది.

# రంజాన్ మాసం ప్రారంభం

### కఠిన ఉపవాస దీక్షలకు విశేషం

హైదరాబాద్,మార్చి12 : నెలవంక దర్శనంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం నుండి నెలరోజులపాటు ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారు. అత్యంత కఠినమైన దీక్షలతో ఉపవాసం చేయడం ఈ మాసం విశేషంగా చెప్పుకోవాలి. ఉపవాస దీక్షలో ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోరు. వేకువజాము నుంచి సాయంత్రి వరకు పచ్చిగంగ కూడా ముట్టరు. తరవాత ఉపవాసం విడుస్తారు.ఇలా నెలరోజులపాటు ఉపవాసదీక్ష చేయడం ముస్లిం పవిత్ర కర్తవ్యంగా భావిస్తారు. పవిత్రత అన్నది ప్రతి మతంలోనూ ఉంటుంది. ఆచార వ్యవహారాలు కూడా ఓ క్రమపద్ధతిలో మనిషిని నిలబెడుతాయి. ఇందుకు ముస్లింల ఉపవాసాలు సాగించే రంజాన్ ప్రత్యక్ష ఉదాహరణ. ఓ నియమబద్ధమైన జీవితానికి ఇది తార్కారణంగా నిలుస్తుంది. ఈ నెలరోజుల కఠిన ఉపవాసంలో అనుసరించిన సన్మార్గాన్ని యేడాదంతా కొనసాగించాలని మహ్మద్ ప్రవక్త ఆదేశం. అల్లాహ్‌తో మన సంబంధాలు మరింత దృఢం చేసుకొనే అవకాశాన్ని రంజాన్ అందించింది. అల్లాహ్‌ను మన్నింపు కోరుకోవడానికీ, మనం ఎలాంటి స్థితిలో ఉన్నామో విశ్లేషించుకోవడానికీ, మన జీవిత లక్ష్యం, మన జీవిత గమ్యం గురించి ఆలోచించడానికీ, దైవాదేశాల ప్రకారం మన జీవితాల్ని చక్కదిద్దుకోవడానికీ అవసరమైన అవకాశాన్ని రంజాన్ మాసం కల్పించింది. ఆ అవకాశాన్ని మనం ఎంతవరకూ ఉపయోగించుకున్నామన్నది ఆలోచించుకోవడానికి ఈ నెల రోజులు ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భగవంతుడి ఆదేశాలను పాటిస్తారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజులు ప్రతి ఒక్కరూ దీనిని పవిత్ర కార్యంగా అల్లాహ్ కోసం నియమ నిబంధనలతో పాటించడం బహుశా అరుదైన విశేషమైన ప్రక్రియగా చూడాలి. ఇందులో ఆరోగ్య సూత్రాలూ ఇమిడి ఉన్నాయి. భగవంతుడిపై ప్రేమా ఉంది. కఠిన ఆచారమూ ఉంది. రోజా మనలో ఉన్న మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడుకు దూరం చేసి.. సత్ప్రవర్తనవైపు నడిపిస్తుంది.

### మసీదు ప్రాంతాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకొని

# పోలీసులు భద్రత సిద్ధం చేయాలి

**కొడంగల్ మార్చి12(జనం సాక్షి):**పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం పురస్కరించుకుని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టడంతో ప్రతీ రోజు సాయంత్రం సమయంలో 5 గంటల తర్వాత పోలీసులు వాహనాలను ఆపరాదు. ఆ సమయంలో ముస్లిం సోదరులు మజీద్ లకు ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఉపవాస దీక్షల విరమణ కు వెళ్తారు. వాహనాలు ఆపడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ ఎస్కీ.గుల్షన్, ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు అన్నారు.ఈ సందర్భంగా ఆయన కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి కి ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది. అదే విధంగా ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా రాత్రి వేళల్లో రాత్రి 1 గంట వరకు పాన్ డబ్బాలు, హెూటల్స్ మూయించరాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం నూతనంగా కొడంగల్ సిఐగా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ రెడ్డిని



శాలువాలతో సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తజ్ హుస్సేన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.అజర్,ఎండీ.అమీర్ హుసేన్, ఎండీ.రహీం,ఎండీ.మహమూద్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

### కోట్లు విలువ చేసే దేవాలయ భూములు కాజేస్తున్న

# సంస్థలపై చర్యలు తీసుకోవాలి





- **దేవాలయ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలి.**
- **కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్.**

**శంషాబాద్, మార్చి 12 ( జనంసాక్షి )**
శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సాతాంరాయి లోని సీతారామ దేవాలయల భూములను కబ్జా చేసి త్రిలోక్ అనే నిర్మాణ సంస్థ భారీ సెల్లార్ తీసి నిర్మాణాలు చేపడుతున్నారాని కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ సంజయ్ యాదవ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ల పల్లి నరేందర్ ఆరోపించారు. కౌన్సిలర్ సంజయ్ యాదవ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 6 68 లో 7 ఎకరాల 18 గుంటల సీతారామ దేవాలయ భూములు ఉన్నాయి. దీనిలో సుమారు 1200 గజాలు త్రిలోక్ అనే నిర్మాణ సంస్థ కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మంగళవారం ఏడి అధికారులు సర్వే చేయగా సుమారు 8 గుంటల భూమి కబ్జాకు గురైందని తెలిపారు. గుడి పక్కనే ఉన్న పెట్రోల్ పంపు విజయ్ సర్వీస్ స్టేషన్ వాళ్లు సుమారు నాలుగు గుంటల భూమిని కబ్జా చేసి వాడుకుంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, కోట్లు విలువ చేసే దేవాలయ భూములను కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో దేవాలయ భూములను పట్టించుకునే నాధుడు లేక మున్సిపాలిటీలో ని ప్రజా ప్రతినిధుల అండదండలతో ఈ తతంగం అంతా జరిగిందన్నారు. దేవాలయ భూముల పై సమగ్రమైన దర్యాప్తు చేయాలన్నారు. కబ్జాకు కారకులైన వ్యక్తులపైన సహకరించిన ప్రజా ప్రతినిధులను, అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. దేవదాయ శాఖ మంత్రి ని కలిసి సీతారామల భూముల పై న్యాయ విచారణ జరిపించాలని కోరుతామన్నారు.

## కేన్స్ సెమికాన్ సంస్థ తరలకుండా చూడాలి

### పరిశ్రమలు తరలిపోవడం బాధాకరం: కెటిఆర్

**హైదరాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ):**
గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చేసిన కృషి నిష్ఫలమవుతుందని మాజీ మంత్రి కెటి రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సెమీ కండక్టర్ రంగంలో అత్యంత కీలకమైన పెట్టుబడిగా భావిస్తున్న కేన్స్ సెమికాన్ సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్ కి



తరలిపోతున్నట్లు వచ్చిన వార్తలు పై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కంపెనీ గతంలో కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమైనప్పుడు ఎన్నో ప్రయత్నాలు చేసి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించామన్నారు. కంపెనీ కొంగరకలాన్ లో ఫాక్స్ కాన్ పరిశ్రమకు దగ్గరగా భూమి కేటాయింపు కావాలంటే, కేవలం పది రోజుల లోపే అవసరమైన భూమిని కేటాయించి, కంపెనీని ఒప్పించగలిగినట్లు కేటీఆర్ తెలిపారు. అయితే ఇప్పుడు ఇదే కంపెనీ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత తెలంగాణ నుంచి గుజరాత్ కి తమ పెట్టుబడులను తరలిస్తున్నట్లు వచ్చిన వార్తల పైన కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో స్పందించారు. ఈ కంపెనీ క్లాం÷ు యూనిట్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంతో పాటు, సెమీ కండక్టర్ పరిశ్రమ ఈకో సిస్టమ్ కి అత్యంత కీలకమైనదని, ఈ పరిశ్రమ వస్తే ఈ రెండు రంగాల్లో తెలంగాణ రాష్ట్రం మరింత పురోగతి సాధించే అవకాశం ఉంటుంద న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి... చర్చలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోనే తమ పెట్టుబడులను కొనసాగించేటట్లు ఒప్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

## సిఎం రేవంత్ రంజాన్ మాస శుభాకాంక్షలు

హైదరాబాద్: రంజాన్ మాసం సందర్భం గా ముస్లింలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సిఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుంద ని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరు పుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, వారి సంక్షేమా నికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమ ణులకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిపే ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రజల మధ్య శాంతి, సామరస్య భావనలు వెల్లివిరుస్తా యని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా

# కోఆర్డినేటర్‌గా టి. సత్య ప్రకాష్ రెడ్డి

**దౌల్తాబాద్ మర్చి,12(జనంసాక్షి):**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వికారాబాద్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా టి. సత్య ప్రకాష్ రెడ్డి ని నియమిస్తూ అధికారికంగా ప్రకటించిన రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ పెటం. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా నూతన సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా నియమితులైన టి.సత్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామంలో నుండి కాంగ్రెస్ పార్టీలో ఈ స్థాయి వరకు చిన్న వయసులోనే జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించిన నవీన్ పెటం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు.ఇకపై కూడా తెలంగాణలో ఏ గ్రామం చూసిన అభివృద్ధి బాటలో సాగుతుందనారు.

## ప్రజల ఆశీస్సులతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

### పెద్దేముల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎస్. నారాయన్ రెడ్డి



**తాండూరు మార్చి 12(జనంసాక్షి)** ప్రజల ఆశీస్సులతో నర్సింలు మరెన్నో ఉత్తమ పదవులు చేపట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పెద్దేముల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎస్ నారాయన్ రెడ్డి పేర్కొన్నారు.వికారాబాద్ జిల్లా నూతన మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ గా ఎంపికైన మంబాపూర్ టి. నర్సిములుని పెద్దేముల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎస్. నారాయన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నారాయన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరి ఆశీస్సులతో ఇంకా మునుముందు మరెన్నో పదవులు పొందాలని కోరారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జీ రాధ కృష్ణ రెడ్డి,ఎండి మైఫూస్,టి అంజిలయ్య, చాపల వెంకటయ్య, శివా రెడ్డి, పాండు, రాములు,రత్నం, ప్రేమ్,దస్తప్ప, లాల్లప్ప, ఎల్లప్ప తదితరులు పాల్గొని శు భాకాంక్షలు తెలిపారు.

# మహిళ అదృశ్యం.

**మల్కాజిగిరి,మార్చి12(జనంసాక్షి)**



డ్యూటీ కి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన నేరేడ్ మేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం డిఫెన్స్ కాలనీలో నివాసం ఉంటున్న బానోతు శ్రావణి (20) డిఫెన్స్ కాలనీలోని జావిద్ సెలూన్ లో బ్యూటీసియన్ గా పనిచేస్తుంది.ఈనెల 11న డ్యూటీ కి వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిందని రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు,స్నేహితుల దగ్గర వెతికిన ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు దర్యాప్తు చేయగా జావేద్ సెలూన్ నుండి రాత్రి 7 గంటలకు డ్యూటీ ముగించుకుని వెళ్లిందని తెలిపారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# 9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

### 70 వేల నగదు 9 సెల్ ఫోన్లు స్వాధీనం

యాచారం, మార్చ్ 12 (జనం సాక్షి) : పక్కా సమాచారంతో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాటరాయుళ్లను ఎస్ఓటి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకొని యాచారం పోలీసులకు అప్పగించారు. సీఐ శంకర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్ వెనకాల కోళ్ల ఫారంలో పేకాట ఆడుతున్న వారినిఅరెస్ట్ చేశామన్నారు. అరెస్టయిన వారిలో దుగ్యాల మహేష్ (43), తుర్కయంజాల్ గుర్రం రంజిత్ రెడ్డి(33), మొండి గౌరెల్లి ముత్యాల రాజు (39), ఇబ్రహీంపట్నం పబ్బల్ శ్రీనాథ్ (28), మేడిపల్లి పంది మైసయ్య (46), చర్ల పటేల్ గూడా ముదిరెడ్డి కొండల్ రెడ్డి (47), యాచారం జక్క కరుణాకర్ రెడ్డి (47), ఇబ్రహీంపట్నం కొమ్మినేని నారాయణ (40), యాచారం కొలను శివారెడ్డి (27), మొండి గౌరెల్లి ఉన్నారు. వీరంతా పేకాట ఆడుతుండగా రూ.70 వేల నగదును 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని వీరిపై కేసును నమోదు సీఐ శంకర్ కుమార్ తెలిపారు